సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



మరో భారం

టీచర్లపై ప్రభుత్వం మరోభారం వేసింది. 7లోగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వాలని ఆదేశించింది. - 8లో



ఆశలు ఆ'వరి'

వరి ఆశలు ఆవిరయ్యేలా ఉన్నాయి. ఫెంగల్ రైతుల పుట్టి ముంచుతోంది. - 8లో

పనులు పూర్తి చేయాల్సిందే: కలెక్టర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పల్లె పండుగలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, డ్వామా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. పలు మండలాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో పురోగతి పెంచాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కేటాయింపులు రద్దు చేసి, అవసరమైన చోట ఆ నిధుల్ని సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

ఉద్దానంలో పెద్దపులి సంచారం లేదు

పలాస: పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో పెద్ద పులి సంచారం లేదని, ఒక గుర్తు తెలియని జంతువు సంచరిస్తోందని కాశీబుగ్గ అటవీ శాఖ అధికారి మురళీకృష్ణ చెప్పారు. పలాస మండలం నీలావతి గ్రామంలో జీడితోటలో ఉన్న ఆవుల మందపై దాడి చేసి సోమవారం రాత్రి రెండు లేగదూడలను చంపేసింది. వాటి మాంసం తినేసి అక్కడే వాటిని విడిచి పెట్టి ఆ జంతువు వెళ్లిపోయింది. ఈ సంఘటన స్థలాన్ని ఫారెస్టు రేంజరు మురళీకృష్ణ తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పెద్ద పులి మాత్రం కాదని చెప్పారు. అలాగే అది ఏ జంతువు అనేది ఇప్పుడే చెప్పలేమని, ప్రజలు మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంతువు సంచారంతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతంలో అటు ఎలుగుబంట్లు, ఇటు గుర్తు తెలియని జంతువులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వారికి తగిన రక్షణ కల్పించాలని అక్కడ ప్రజలు కోరుతున్నారు.

తీమరలో పులి



తీమర మామిడితోటలో ఆవుదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ రేంజర్ అమ్మన్నాయుడు

పాతపట్నం: మండలంలోని తీమర గ్రామ ప్రాంతంలోని బెండి రామారావుకు చెందిన మామిడితోటలో సోమవారం రాత్రి ఆవుదూడపై పులి దాడి చేసిందని పాతపట్నం ఫారెస్ట్ రేంజర్ అమ్మన్నాయుడు తెలిపారు. మంగళవారం తీమర పంట పొలాల్లో పులి పాద ముద్రలు(పద్మాస్)ను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన బైరి లక్ష్మణరావుకు చెందిన ఆవుదూడను పులి తిన్నట్లు కళేబరాలు ఉన్నాయని అటవీ శాఖాధికారులు తెలిపారు. తీమర, తామర, పెద్దసీది, పాశీగంగుపేట ప్రాంతాల్లో పులి తిరుగుతోందంటూ ప్రచారం జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రొంపివలస నుంచి కొరసవాడ వైపు పులి పాద ముద్రలు ఉన్నట్లు గురించామని, ఈ మేరకు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరారు.

7న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పేరెంట్ టీచర్ డే)ను ఈనెల 7వ తేదీన పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వారపు సమావేశం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పేరెంట్-టీచర్ సమావేశం ద్వారా విద్యార్థులను, తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో పాఠశాలల అభివృద్ధికి దోహదపడే దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో డిసెంబర్ నాటికి మంచినీరు, మరుగుదొడ్లు లేని కేంద్రాలు ఒక్కటి కూడా ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలో మలేరియా, డెంగీ లాంటి కేసులు నమోదు కారాదని స్పష్టమైన విధి విధానాల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయని త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తామని కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, సీపీఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వనాలు వదిలి జనాలపైకి..

- ఎలుగుబంట్లు, గుర్తు తెలియని జంతువులతో బిక్కుబిక్కుమంటున్న ఉద్దానం
- కొత్తూరు, పాలకొండ, వీరఘట్టం, ఎల్ఎన్‌పేట ఏరియాల్లో ఏనుగుల విధ్వంసం
- తాజాగా జిల్లాలో పులి సంచారంతో భయాందోళన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వన్య మృగాలు వనాలు వదిలి జనాలపైకి పడుతున్నాయి. ఆవులు, మేకలను పులి తినేసి భయపెడుతుండగా, ఏనుగులు, ఎలుగుబంట్లు ఏకంగా మనుషుల్నే చంపేస్తున్నాయి. కొత్తూరు, వజ్రపుకొత్తూరు, మందస, వీరఘట్టం, సీతంపేట, పాతపట్నం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస తదితర ప్రాంతాల్లో ఈ రకమైన ఘటనలు ఇప్పటికే జరిగాయి. దీంతో వన్య మృగాలు సంచరిస్తున్న వార్తలు వస్తే చాలు ఈ ప్రాంతాలు వణికిపోతున్నాయి.

సరిగ్గా ఏడాది క్రితం..

జిల్లాలో కొంతకాలంగా పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు జనారణ్యంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఎలుగుబంట్లు దాడులు చేస్తుండగా, కొత్తూరు, పాలకొండ, భామిని తదితర ప్రాంతాల్లో ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇవి చాలదన్నట్టు మధ్యలో పులులు కూడా సంచరిస్తున్నాయి. గత ఏడాది నవంబర్‌లో ఇదే రకంగా పులి సంచరించగా సరిగ్గా ఏడాదికి మళ్లీ పులి జిల్లాలోకి ప్రవేశించింది. తగ్గుతున్న అటవీ విస్తీర్ణం, పెరుగుతున్న ఆక్రమణల వల్లే జంతువులు ఇలా ఊళ్లమీదకు వస్తున్నట్లు తెలుస్తోంది.



పులి పాద ముద్రలు

పులి సంచారమిలా..

- ఒడిశా నుంచి మందస రిజర్వు ఫారెస్టు మీదుగా సాబకోట, బుడంబో తదితర గిరిజన ప్రాంతాలను దాటుకుంటూ వజ్రపుకొత్తూరు తీర ప్రాంతం మీదుగా సంతబొమ్మాళి వైపునకు చేరుకుంది. ఈ మండలంలోని హనుమంతునాయుడుపేట పంచాయతీ కేశనాయుడుపేటలో పులి తిరిగిందన్న ప్రచారం జరిగింది. ఇదే సమయంలో భద్రాచలం శాంతమూర్తికి చెందిన ఆవు మృతి చెందింది. పులి కారణంగా చనిపోయిందా? మరే జంతువు కారణంగా చనిపోయిందో స్పష్టత లేదు.



ఇదే కారణమా..?

'పులులు చాలా అరుదుగా అడవులను వదిల జనావాసాల వైపు వస్తుంటాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో మగ, ఆడ పులులు జతకట్టే సమయం కావడంతో తమ జోడు కోసం అవి సాధారణం కంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. అలాంటి సందర్భాల్లో అడవిని దాటి సరిహద్దు ప్రాంతాల్లోని పంటపొలాలు, గ్రామాల్లోకి వస్తుంటాయి. ఈ సమయంలో దాడులు అధికంగా జరిగే అవకాశం ఉంది. వేసవి ఎండలతో అటవీ ప్రాంతంలో తాగునీటి వనరులు తగ్గినప్పుడు కూడా అవి జనావాసాల వైపు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. రైతులు పశువులను మేత కోసం అడవుల్లోకి తీసుకెళ్లడంతో వాటిని వేటాడేందుకు యత్నిస్తాయి. అటవీ సరిహద్దు ప్రాంతంలోని పంట పొలాల్లో పశువులు, మేకలు, గొర్రెలను మందలుగా ఉంచడంతో వాటిని కూడా వేటాడే అవకాశాలు ఉంటాయి.' అని నిపుణులు చెబుతున్నారు.

- కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో పెద్దపులి ఆనవాళ్లు కనిపించాయి. సారవకోట మండలం జమ చక్రం, సోమయ్యపేట, అన్నుపురం, వాబచుట్టు, బోరుభద్ర పరిసర ప్రాంతాల్లో సంచరించిన పులి పాతపట్నం మండలంలోకి ప్రవేశించింది. బోరుభద్ర, దాసుపురం, గురండి, తీమర, తామర, పెద్దసీదిలో సంచరించింది. తీమరలోని బెండి రామారావు మామిడితోటలో బైరి లక్ష్మణరావుకు చెందిన ఆవుదూడను చంపేసింది.
- ఇదే సమయంలో ఉద్దానంలో గుర్తు తెలియని జంతువు కూడా తిరుగుతోంది. దాని దాడి ఎక్కువగా ఉంది. వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లోని ఒంకులూరు, మెట్టూరు, కొండపల్లి, అనకాపల్లి, బహడపల్లి, కొండలోగాం గ్రామాల్లో ఈ జంతువు సంచరించింది. పలాస మండలంలో నీలావతిలో రెండు ఆవు దూడలను చంపేసింది.

జాగ్రత్త సుమా

- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు వన్య మృగాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.
- సాయంత్రం 5గంటల నుంచి ఉదయం 7గంటల వరకు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదు. పులులు గ్రామాల్లోకి, పొలాల్లోకి వస్తే శివారు ప్రాంత ప్రజలు వెంటనే అప్రమత్తమై శబ్దం చేస్తూ చాకచక్యంగా తిరిగి అడవిలోకి పంపించాలి.
- పులి అరుపులు, పాద ముద్రలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.
- పంటల కాపలాకు రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లకుండా బృందంగా వెళ్లాలి.
- పొలాల్లో మంచెలు ఏర్పాటు చేసుకుని గుంపులుగా ఉండాలి.
- పశువుల కాపరులు పగలంతా మేత కోసం సంచరించి రాత్రి అటవీ ప్రాంతంలో మందను ఉంచి బస చేస్తుంటారు.
- పులులు వాటిని వేటాడేందుకు వస్తుంటాయి.
- రాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో ఉండటం సురక్షితం కాదని అటవీశాఖ సిబ్బంది చెబుతున్నారు.

అడవులు తగ్గుముఖం పట్టడం వలనే

అడవుల శాతం తగ్గు ముఖం పట్టడంతో కొన్ని రకాల వన్య మృగాలు ఆహార అన్వేషణలో జనాలు ఉండే చోటుకు వస్తున్నాయి. అయితే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సాంకేతిక పరంగా ట్రాకింగ్ కెమెరాలతో పులి వంటి వన్యప్రాణుల కదలికలను గుర్తిస్తున్నాం. మాకున్న సమాచారం ప్రకారం ఇటీవల జిల్లాలో ప్రవేశించిన పెద్ద పులి ప్రస్తుతం ఒడిశాలోకి వెళ్లిపోయింది.

– నాగేంద్ర, టెక్కలి డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్



ఇబ్బందికరంగానే ఉంది...

మా మండలంలో పులి తిరుగుతుందని పేపర్లు, వాట్సాప్‌లలో చూస్తుంటే భయమేస్తుంది. మేము నిత్యం కొండలు, పంట పొలాలలో మేకలు, గొర్రెలతో మందలు వేసుకుని పడుకుంటున్నాం. మా ఊరికి దగ్గర్లో ఉన్న జమచక్రం, సోమయ్యపేట గ్రామాలలో పులి అడుగులు గుర్తించడంతో ఆయా గ్రామాల నుంచి మందలు తీసుకొచ్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత ఇబ్బంది పడుతున్నాం.

– పల్ల ముఖలింగం, వడ్డినవలస, సారవకోట మండలం.



భయం.. భయం..

పులి మా గ్రామ పంట పొలాల్లో తిరగడంతో మాకు భయంగా ఉంది. పశువులు మేతకు తీసుకు వెళ్లడానికి, ఉదయం పొలాలకు వెళ్లాలన్నా భయంగా ఉంది. ఇప్పటికే ఆవుదూడను తీనేసింది. పులి ఉందని అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు.

– మద్ది నారాయణరెడ్డి, పెద్దసీది గ్రామం, పాతపట్నం మండలం



ఆందోళనకరమే..

పులి సంచరిస్తున్న వార్తలతో ఆందోళనగా ఉంది. మా గ్రామం వైపు పులి వచ్చిందని మాకు తెలియదు, మంగళవారం ఉదయం ఆవుదూడపై దాడి చేయడంతో మాకు పులి వచ్చిందని తెలిసింది. దీంతో పంట పొలాలవైపు వెళ్లాలంటే భయంగా ఉంది.

– బంది ఆనంద్, తీమర గ్రామం, పాతపట్నం మండలం



రాణివ్వబోం..

మత్తు పదార్థాలను జిల్లాలోకి రానివ్వకుండా పోలీసులు గస్తీ కాస్తున్నారు. నార్కోటిక్ డాగ్ రాణి సాయంతో మంగళవారం శ్రీముఖలింగం, చల్లవానిపేట దుకాణాలతో పాటు తిలారు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. – జలుమూరు



సంబరం

జిల్లాకేంద్రంలోని చిన్నబజారులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చిలో మంగళవారం స్కూల్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీసులు జరిగాయి. దేవుని వాక్యాన్ని సంఘ కాపరి ఆర్.అశోక్‌కుమార్ అందించారు. – శ్రీకాకుళం కల్చరల్



సందేశం

మత్తుకు బానిసలు కావద్దంటూ విద్యార్థులు సందేశమిచ్చారు. గార సర్కిల్ వద్ద 'సంకల్పం' కార్యక్రమంలో శాంతినికేతన్ విద్యార్థులు పాల్గొని మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించారు. – గార



సంకల్పం

ఈయన పేరు పూజారి తిరుపతిరావు. ఒకప్పుడు ఆటో డ్రైవర్‌గా పనిచేసిన తిరుపతిరావు ఓ ప్రమాదంలో కాళ్లు కోల్పోయారు. కానీ కుటుంబ భారాన్ని మోయడం ఆపలేదు. ప్రభుత్వ సహకారంతో ఎలక్ట్రిక్‌సైకిల్ తీసుకుని వీధుల్లో పూల మొక్కలు విక్రయిస్తూ కుటుంబం కడుపు నింపుతున్నారు. తన పరిస్థితి తలచుకుని కుంగిపోకుండా ధైర్యంగా బతుకుతూ స్ఫూర్తినింపుతున్నారు. – టెక్కలి రూరల్

ఖాదీ ఉద్యోగి శంకరరావుకు బెనారస్ విశ్వవిద్యాలయం ఆహ్వానం



శంకరరావు

పొందూరు: కాశీలోని హిందూ బెనారస్ విశ్వవిద్యాలయం భారత్ కళాభవన్‌లో ఈ నెల 7న జరిగే ఆర్టిస్టిక్ ఇంటర్నేషనల్ ఖాదీ పుస్తక ఆవిష్కరణ మహోత్సవానికి స్థానిక ఖాదీ సంస్థ ఉద్యోగి జల్లేపల్లి శంకరరావుకు ఆహ్వానం లభించింది. డ్రీమింగ్ ఇట్ ఫార్వర్డ్ అనే పేరుతో ఈ పుస్తకం ఆవిష్కరణకు సిద్ధంగా ఉంది. దీన్ని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ ఆవిష్కరించనున్నారు. తానాబానా ట్రస్టు(కాశీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ పుస్తకంలో పొందూరు సన్నఖాదీకి సంబంధించిన వివిధ అంశాలు చేర్చడం విశేషం. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానితుడైన శంకరరావు హిందీ-తెలుగు అనువాదకునిగా గుర్తింపు పొందారు. 2007లో నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ హైదరాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి భవన్‌లో బస చేసినప్పుడు ఆమెకు పొందూరు ఖాదీ ప్రత్యేకతను శంకరరావే వివరించారు. తర్వాత ఆమె పొందూరు నుంచి ఓ చీరను కూడా తెప్పించుకున్నారు. హిందీ-తెలుగు అనువాదకునిగా గుర్తింపు పొందిన శంకరరావు స్థానిక ఖాదీ సంస్థకు మొత్తం మూడు సార్లు వచ్చిన గాంధీ మనుమరాలు తారాభట్టాచార్జికి అనువాదకునిగా కూడా వ్యవహరించారు. ఆయన మహారాష్ట్ర వార్ధా జిల్లా సేవాగ్రామ్‌లో జన్మించారు. తండ్రి సత్యనారాయణ అప్పట్లో అక్కడ కేవీఐసీ ఉద్యోగిగా పనిచేశారు. శంకరరావును ఈ సందర్భంగా ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జికె ప్రసాద్, డీవీ రమణ, సిబ్బంది, కార్మికులు, 'పొందూరు మరో పోర్‌బందర్' పుస్తక రచయిత వాండ్రంగి కొండలరావులు అభినందించారు.

మరో పోరుకు సిద్ధమవుదాం



కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కొత్తూరు: విద్యుత్ బిల్లుల విషయంలో కూటమి ప్రభుత్వం మాట మార్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు అన్నారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని గోవిందరావు అన్నారు. రెండుసార్లు సర్దుబాటు పేర్లతో విద్యుత్ చార్జీలు పెంచడం భావ్యం కాదన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు.

అదానీ కోసమే విద్యుత్ చార్జీలు పెంచుతున్నట్లు విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే మరోపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గంగరాపు సింహాచలం, జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు, కార్మిక సంఘం నాయకులు పల్ల కృష్ణలు ఉన్నారు.

తోలాపిలో అమానుషం

- ప్రపంచ దివ్యాంగ దినోత్సవం రోజే దివ్యాంగ ఉద్యోగిపై దాడి
- తోలాపి సచివాలయంలో టీడీపీ ఎంపీటీసీ భర్త వీరంగం



బాధిత వీఆర్వో రేవతిరావు

పొందూరు: ప్రపంచ దివ్యాంగ దినోత్సవం రోజునే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తన నీచ ప్రవర్తనను బయటపెట్టాడు. దివ్యాంగ ఉద్యోగి అని చూడకుండా సచివాలయంలో ఉన్న వీఆర్వోపై దాడికి పాల్పడ్డాడు. అధికార పార్టీ నాయకుడిననే అహంకారం, టీడీపీ ఎంపీటీసీ భర్తననే అహంభావంతో తోలాపి సచివాలయంలో మంగళవారం వీరంగం సృష్టించాడు. వివరాల్లోకి వెళితే...

తోలాపి ఎంపీటీసీ భర్త పప్పల రామినాయుడు సుమారు 3 గంటల సమయంలో తోలాపి సచివాలయానికి వచ్చాడు. ఆ సమయంలో ఉన్న సచివాలయం కార్యదర్శి కూన వినోద్‌తో గ్యాస్ సబ్సిడీ వైఎస్సార్‌సీపీ అనుచరులకు పడిందనే విషయంపై వాగ్వాదం జరిగింది. అయితే గ్యాస్ సబ్సిడీ అంశం తమది కాదని నచ్చజెప్పి కార్యదర్శి వినోద్ బయటకు వెళ్లాడు. అప్పటికి కార్యాలయంలో ఉన్న రామినాయుడు మద్యం మత్తులో అక్కడి కంప్యూటర్లను నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. శబ్దం విని వచ్చిన వీఆర్‌ఓ ఎం.దివాకర్(రేవతిరావు)పై విచక్షణ రహితంగా దాడికి దిగాడు. మెడ పట్టుకుని గట్టిగా నొక్కడంతో వీఆర్‌ఓ గిలగిలలాడాడు. అక్కడే ఉన్న ఉపసర్పంచ్ పప్పల శ్రీనివాసరావు వీఆర్వోను రామినాయుడు నుంచి విడదీశాడు. దీంతో వీఆర్వోకు పెద్ద ప్రమాదమే తప్పింది.



ధ్వంసమైన కంప్యూటర్

వీఆర్వోకు మండలంలో వివాద రహితుడు, సౌమ్యుడనే పేరుంది. దివ్యాంగుడైన రేవతిరావుకు తోలాపి గ్రామంలోనూ మంచి పేరు ఉంది. అలాంటి ఉద్యోగిపై దాడికి పాల్పడటంతో అధికార పార్టీ నాయకుల్లోనే కాకుండా గ్రామస్తులలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీఆర్వోపై దాడి జరిగిన విషయంపై విధి నిర్వహణలో ఉన్న తోటి ఉద్యోగులు కార్యదర్శికి సమాచారం అందించారు. వెంటనే కార్యాలయానికి వచ్చిన కార్యదర్శికి పరిస్థితి అర్థం కావడంతో వెంటనే విషయాన్ని ఎంపీడీఓ మన్మథరావు, ఈఓఆర్డీ సింహాచలంకు సమాచారం ఇచ్చారు. ఇదే సమయంలో వీఆర్వో రేవతిరావు తహసీల్దార్ వెంకటేష్ రామానుజంకు విషయాన్ని తెలిపారు. తక్షణమే కార్యాలయం నుంచి వచ్చేయాలని తహసీల్దార్ వీఆర్వోకు సూచించారు.

వారం రోజుల్లోగా ఖాతాదారులకు సమాచారమిస్తాం



ఖాతాదారులతో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం అబ్దుల్ అమీర్ అసీద్

గార: గార ఎస్‌బీఐలో ఖాతాదారుల బంగారం ఎంతకాలం ఉంటే వాటి వడ్డీని చెల్లించాలన్న డిమాండ్‌పై ఉన్నతాధికారులతో మాట్లాడి వారం రోజుల్లోగా సమాచారమిస్తామని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ అబ్దుల్ అమీర్ అసీద్ అన్నారు. మంగళవారం ఖాతాదారులు బ్యాంకు మెయిన్‌గేట్‌ను మూసివేసి నిరసనలు తెలియజేశారు. తమ బంగారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు కార్యక్రమాలను అడ్డుకోవడంతో ఆర్‌ఎంతో పాటు లాయర్ తిరుమలరావు ఖాతాదారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. తనఖాలో ఉన్న బంగారాన్ని ఇవ్వాలని ఖాతాదారులు కోరితే కోర్టు పరిధిలో ఉందని, ఈ నెల 13వ తేదీ వాయిదా ఉందని అంతకుమించి ఏమీ చేయలేమని చెప్పారు. ఎస్ఐ ఆర్.జనార్ధనరావు, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. 11.30 గంటల తర్వాత బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

క్లుప్తంగా

బొగ్గు లారీ బోల్తా



సర్వీసు రోడ్డుపై బోల్తా పడిన లారీ

నరసన్నపేట : టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వెళ్లే దారిలో గొట్టిపల్లి ఫ్లై ఓవర్ డౌన్‌లో జాతీయ రహదారిపై మంగళవారం బొగ్గు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డివైడర్ దాటి సర్వీసు రోడ్డుపై అడ్డంగా పడింది. ఒడిశాలో తాల్చేరు నుంచి అనకాపల్లికి వెళ్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. లారీ వంద మీటర్ల దూరం ముందుకు దూసుకెళ్లడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. పోల్ విరిగినా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే సర్వీసు రోడ్డుపై రాకపోకలు స్తంభించడంతో నరసన్నపేట హెచ్‌సీ దాలినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన డ్రైవర్ పూర్ణను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



చాపర పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: ఆశ్రమ పాఠశాలల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ, తరగతిగదులు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సౌకర్యాలు, బోధనపై ఆరా తీశారు. అనంతరం చాపర, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. చాపర పీహెచ్‌సీలో విద్యుత్ సమస్య ఉందని వైద్యులు పావని,హేమంతలక్ష్మి పీఓ దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ



రమేష్‌కు పర్సును అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: హిరమండలం మండలంలోని తుంగతంపర గ్రామానికి చెందిన సీహెచ్ రమేష్ మంగళవారం ఉదయం విశాఖలో ఆర్టీసీ బస్సు ఎక్కి శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో దిగాడు. ఇంటికి వెళ్లాక పర్సు కనిపించకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యాడు. అయితే ఆ పర్సు నాన్‌స్టాప్ బస్ డ్రైవర్‌కు దొరకడంతో ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు ద్వారా ప్రయాణికుడికి అందజేశారు. పర్సులో రూ.8250 నగదు, 2 ఏటీఎం కార్డులు ఉన్నాయి. ఈ సందర్భంగా డ్రైవర్‌ను ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

విద్యుత్ షాక్‌తో మూడు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామ పరిధిలోని పొలాల్లో మేతకు వెళ్లిన మూడు పాడి ఆవులు మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృత్యువాత పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. హైటెన్షన్ వైర్లు పొలాల్లో తెగిపడి ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో పొట్నూరు అచ్చోదుకి చెందిన రెండు ఆవులు(రూ.1.20 లక్షలు), పిల్లాటి అప్పన్నమ్మకు చెందిన ఆవు మృతి(రూ.70 వేలు) మృతి చెందాయి. ప్రమాద ఘటన వివరాలను ఎంపీటీసీ బగ్గు రాజారావు రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 14 గేదెలను జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కంచిలి నుంచి విశాఖపట్నం వైపు ఒక వ్యానులో 9 గేదెలు, మరో వ్యానులో 5 గేదెలు అక్రమంగా తరలిస్తున్నారు. వీటిని పైడిభీమవరం వద్ద పట్టుకుని కొత్తవలస గోశాలకు తరలించారు. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై .. మ(శి)రో భారం!

- డిసెంబర్ 7లోగా ప్రోగ్రస్ కార్డులు సిద్ధం చేయాలి
- ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మార్కులకు భిన్నంగా కొత్త పద్ధతి
- ఒక్కో విద్యార్థికి 8 పేజీల కార్డు
- ఇప్పటికే భారంగా మారిన అపార్ నమోదు
- పరీక్షల వేళ విద్యా బోధనకు ఆటంకాలు



ప్రోగ్రస్ కార్డు నమూనా



శ్రీకాకుళం: పరీక్షల వేళ విద్యా బోధనకు దూరం చేసేలా రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయులపై మరో భారం మోపింది. విద్యార్థులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రస్ కార్డుల పేరిట ప్రవేశ పెట్టనున్న ప్రగతి కార్డులను డిసెంబర్ 7వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎనిమిది పేజీలతో ఉన్న ఈ కార్డులో విద్యార్థికి సంబంధించిన పెన్ నెంబర్, ఆధార్ నెంబర్, అపార్ నంబర్లతో పాటు తల్లిదండ్రుల పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను సైతం కార్డులో పొందుపరచాల్సి ఉంటుంది.

ఒక్కో విద్యార్థికి అర గంట సమయం..

ఇప్పటి వరకు విద్యార్థికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డ్, అస్సైన్‌మెంట్ తదితర వివరాలకు సంబంధించి ఒక్కొక్కదానికి పది మార్కులకు గాను నమోదు చేయించారు. మిగిలిన 20 మార్కులు పరీక్షల్లో విద్యార్థి చూపిన ప్రతిభ ప్రకారం నింపాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లోను, పాఠశాల రికార్డుల్లోనూ ఇలాగే నమోదు చేస్తూ వచ్చారు. తాజాగా కార్డుల్లో మాత్రం ఐదేసి మార్కులకు కుదించి పరీక్షల్లో ప్రతిభకు 35 మార్కులు కేటాయించటంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతీ విద్యార్థికి గతంలో కేటాయించిన మార్కుల్లో 50 శాతం కోత విధించి రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వివరాలు నమోదు చేసేందుకు ఒక్కొక్క విద్యార్థికి 30 నిమిషాలకు పైనే సమయం పడుతుంది. కార్డు నింపడం ఒక్క ఉపాధ్యాయుడితో జరిగే పనికాకపోవటంతో ఒక్కొక్క తరగతికి ముగ్గురు, నలుగురు ఉపాధ్యాయులు కలసి వివరాలు నమోదు చేస్తున్నారు.

అపార్ అవస్థలు వీడకముందే..

ఇప్పటికే అపార్ ప్రక్రియతో ఉపాధ్యాయులు ఎంతగానో ఇబ్బందులు పడ్డారు. వారి సమస్యను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తాజాగా మరో పని అప్పగించటం పట్ల ఉపాధ్యాయ వార్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నెల 7న జరగనున్న తల్లిదండ్రుల మెగా సమావేశం నాటికి కార్డుల నమెదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనిపూర్తి చేయాలంటే అంతకంటే ముందు అపార్ నమోదు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నెలలోనే విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షల జరగనున్న నేపథ్యంలో బోధన జరగకుండా అధికారులు ఉపాధ్యాయలను బోధనేతర పనులకు వినియోగిస్తుండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ నుంచి ఉపాధ్యాయులు బోధనకు దూరమయ్యారు. ఈ కారణంగా సిలబస్ కూడా పూర్తికాకపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రత్యామ్నయ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సెలవులు లేనట్లే..

పదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు లేనట్లే. మార్చి 15 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం సంక్రాంతి సెలవుల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించింది. సంక్రాంతి సెలవులు మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని నిశ్చయించింది. దీని ప్రకారం ఆదివారాల్లో కూడా తరగతులు జరగనున్నాయి. ఇప్పటికే మౌఖిక ఆదేశాలు రాగా ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి.

సెలవు దినాల్లో స్టడీ అవర్స్ వద్దు

శ్రీకాకుళం: పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే స్టడీ అవర్స్‌ను సెలవు రోజుల్లో లేకుండా మినహాయింపునివ్వాలని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావులు విద్యాశాఖాధికారులకు కోరారు. రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి వంద రోజుల కార్యాచరణలో ప్రతీ ఆదివారం, సంక్రాంతి సెలవులలో పండుగ మూడు రోజులు తప్ప, మిగిలిన అన్ని రోజులు క్లాసులు నిర్వహించాలని ఆదేశించడం శాస్త్రీయంగా లేదన్నారు. ఈ రకమైన ఆదేశాలతో విద్యార్థులను, ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం భావ్యం కాదన్నారు.

త్వరగానే..

కార్డు నింపటం ఐదు నిమిషాల్లోనే పూర్తి చేయవచ్చు. గతంలో పది మార్కులకు నమోదు చేసిన వాటిని ఐదు మార్కులకు కుదించారు. వాటిని చూసి కార్డుల్లో నింపేయవచ్చు. విద్యార్థుల వివరాలు ఇప్పటికే యూడైస్, పెన్, అపార్‌లో సిద్ధంగా ఉన్నాయి.

– ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

ఆశలు ఆవరి



దొంకూరు ప్రాంతంలోని పంట పొలాల్లో నిలిచిన వర్షం నీరు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన మోస్తరు వర్షానికి జిల్లాలో పలు ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. పొలాల్లో చేలు నేలకొరగ్గా.. కోతలు పూర్తయిన చోట పనలు తడిచిపోయాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ధాన్యం రాశులను ఆరబెట్టే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

– ఇచ్ఛాపురం రూరల్/సారవకోట/జి.సిగడాం



చిన్నలక్ష్మీపురంలో వర్షం ధాటికి నేలకొరిగిన వరి పైరు



వర్షానికి తడిసిన ధాన్యం ఓవులను ఆరబెడుతున్న దొంకూరు రైతులు



నల్లిపేటలో మొలకెత్తిన వరి పంటను చూపిస్తున్న రైతు సత్యనారాయణ



తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

రోడ్డు పనులు వేగవంతం చేయండి



ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అనుమతులు ఉన్న చోట రోడ్డు పనులు వేగవంతం చేయాలని, ముగింపు దశలో ఉన్న భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, పంచాయతీరాజ్ ఈఈ ఎస్.రామకృష్ణ, జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్ట్‌లో 315 రోడ్డు పనులు ఉన్నాయని, అందులో 35 పూర్తయ్యాయని, 280 పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, సోంపేట పనులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏషాన్ బాషా, పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ



స్టాపర్లను ప్రారంభిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణతో సంబంధిత విభాగాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం సీఎంఆర్, ఎస్ఆర్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యాల సౌజన్యంతో అందజేసిన స్టాపర్స్, రేడియం జాకెట్లు, మాస్కులు, ఎల్ఈడీ బ్యాటన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల ఇరుకు రోడ్డు వల్ల ట్రాఫిక్ సమస్య వస్తోందని, అలాంటి చోట్ల ఈ పరికరాలు ట్రాఫిక్ నియంత్రణలో సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు ఇమాన్యువల్ రాజు, పైడపునాయుడు, యాజమాన్యాల ప్రతినిధులు జీవీ రమణ, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, రాజేష్, సురేష్, వేణుగోపాల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాంగ మంత్రి దృష్టికి 'సౌదీ' కార్మికుల సమస్య



జైశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉపాధి నిమిత్తం విదేశాలకు వలస వెళ్లి మోసపూరిత యాజమాన్యాల చేతిలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కార్మికులను తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను ఢిల్లీలో మంగళవారం కలిసి సమస్య వివరించారు. 22 మంది కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆహారం సైతం లేక అల్లాడుతున్నారని చెప్పారు. బాధితులకు సత్వర సాయం అందించేలా సౌదీలోని భారత ఎంబసీకి సమాచారం అందించాలని విన్నవించారు. దీనిపై జైశంకర్ సానుకూలంగా స్పందించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దివ్యాంగుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఓ దివ్యాంగుడు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్‌కు కేంద్ర మంత్రి సూచించినట్లు చెప్పారు. స్వయం ఉపాధి రుణాల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. 2023–25 బ్యాక్‌లాగ్ పోస్టులపై భర్తీపై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు లక్ష్యం సాధించేందుకు అంగవైకల్యం అడ్డురాదన్నారు. అనంతరం బెహర మనో వికాస కేంద్రం విభిన్న ప్రతిభావంతులు కోలాటంతో ఆకట్టుకున్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కళ్లేపల్లి ఉషారాణి విభిన్న ప్రతిభావంతులకు వివిధ ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు కవిత, దివ్యాంగుల సంఘం కార్యదర్శి డాక్టర్ ఎంకే మిశ్రో, విభిన్న ప్రతిభావంతుల అసోషియేషన్ ప్రతినిధి రత్నాల శ్రీనివాసరావు, ఉంగటి సురేష్, దివ్యాంగులు అప్పలనాయుడు, సింహాచలం, రమా, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కె.చెన్నకేశవరావు, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సుకు తప్పిన పెను ప్రమాదం




పాతహిరమండలం సమీపంలో పక్కకు ఒరిగిన బస్సు

హిరమండలం: హిరమండలం వద్ద ఓ ప్రైవేటు బస్సుకు భారీ ప్రమాదం తప్పింది. గుణుపూర్ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న బస్సు మంగళవారం మధ్యాహ్నం పాత హిరమండలం పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఆ సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు పక్కనే చెరువు ఉంది. ఏ మాత్రం అటు ఒరిగినా భారీ ప్రమాదం జరిగి ఉండేది. ఆ సమయంలో బస్సులో 30 మంది వరకూ ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

గొలుసు చోరీ

రణస్థలం: మండల కేంద్రం రణస్థలం నుంచి జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస ఆటోలో వెళుతున్న జైను పాపయమ్మ అనే మహిళ నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంవలస వెళ్లేందుకు థియేటర్ వద్ద పాపయమ్మ ఆటో ఎక్కింది. అప్పటికే అందులో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారు పాపయ్యమ్మను మాటలతో మాయ చేసి గొలుసును తస్కరించారు. ఇంటికి వెళ్లాక గొలుసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం తరలింపులో కక్ష సాధింపు తగదు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ, రైతులు

కంచిలి: రైతులు పండించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు వీలు లేకుండా టీడీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కంచిలి ఎంపీపీ, శ్రీ కంచమ్మతల్లి మోడరన్ రైస్‌మిల్లు యజమాని పైల దేవదాస్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం దళారులతో ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి విముక్తి కలిగిస్తూ, సుమారు పదేళ్లుగా సిర్తలి గ్రామంలో రైస్‌మిల్లును నెలకొల్పి నిజాయితీగా వ్యాపారం చేస్తూ, సేవాదృక్పథంతో లావాదేవీలు చేస్తున్నదానికి రాజకీయ రంగు పులిమి, ప్రభుత్వం నుంచి మంజూరు చేసే సార్టెక్స్ అనుమతులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ మేరకు తహశీల్దార్ ఎన్. రమేష్‌కుమార్‌ను పరిసర ప్రాంత రైతులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కక్ష సాధింపు చర్యలు వీడి సార్టెక్స్ అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు యారడి ఆనందరావు, అయిధం జయరాం, పలికల జయరాం, డొక్కరి బలరాం, కప్పల యుగంధర్, మెండ ప్రకాశ్, బుడ్డెపు విశ్వనాథం, రైతులు పాల్గొన్నారు.

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దు



నిరసన ర్యాలీలో ఉద్దాన మహిళలు

కాశీబుగ్గ:

పచ్చటి ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని ప్రజా సంఘ నాయకులు అన్నారు. మందస మండలం రాంపురంలో మంగళవారం బాధిత రైతులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చాపర వేణుగోపాలరావు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి పనులు చేస్తే హర్షిస్తారో వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరం లేని కార్గో విమానాశ్రయం కట్టడం వల్ల ఉద్దాన వాసులకు ఏం ఉపయోగమో చెప్పాలన్నారు. భూములకు పరిహారం ఇచ్చినంత మాత్రాన వారి జీవితాలు గడిచిపోవని, విలువైన భూములు ఉంటే నిత్యం ఉపాధి ఉంటుందని స్పష్టం చేశారు. సుమారు 1400 ఎకరాల భూమిని ఎంపిక చేస్తున్నప్పుడు స్థానికుల అభిప్రాయం పట్టించుకోకపోవడం తగదన్నారు. తక్షణమే నిర్ణయాన్ని వెనుక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలతో కలిసి ఉద్దాన ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘ నాయకులు సీహెచ్ రవికుమార్, బత్తిని లక్ష్మణరావు, నారాయణస్వామి, పి.ఆరేలమ్మ, కొన్న శ్రీనివాసరావు, తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ వాసు, నాయకులు గున్నయ్య, పరుశురాం, సంతోష్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస:

చేపల పెంపకంలో శాస్త్రీయ విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం చేపలు రొయ్యల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణపై మత్స్య శాఖ విస్తరణ అధికారులకు శిక్షణ నిర్వహించారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి(హైదరాబాద్) సహకారంతో ఈ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యాధి నిర్ధారణ యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉన్నప్పుడే రైతులకు నాణ్యమైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు జి.ఎస్.రాయ్, సునీత, హరికుమార్, కిరణ్‌కుమార్, అనూషా తదితరులు పాల్గొన్నారు.